# దేహమును పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి!

పాపభీతి లేని పామరత్వముబట్టి
దైవప్రీతి లేని దారిపట్టి
మానవత్వమణగె మానవులందున
విశ్వశాంతికిదియె విప్లవంబు.

విద్యార్థులారా!

విశ్వశాంతిని చేకూర్చు విధము నేర్పి
సంకుచిత భావములనెల్ల సమయజేసి
ఐకమత్యము సహజీవనాదికములు
సమత నేర్పుటయె కాదె సరసవిద్య.

ప్రేమస్వరూపులారా! ఈ చరాచర ప్రపంచమందు ఎందు చూచినా అశాంతి, అలజడులు, భయము, దుఃఖములతో కుమిలిపోతున్నాది. అశాంతి, అక్రమము, అనాచారము, అసత్యము అనే పలువిధములైన పిశాచములు ప్రళయతాండవము సలుపుతున్న ఈ సమయమునందు శాంతి భద్రతలతో చల్లార్చి ఆదుకొనే శక్తి ఒక్క విద్యార్థులకు మాత్రమే ఉన్నది. సమర్థులైన విద్యార్థులారా! ఈనాడు మనము ఏకాత్మభావమును అభివృద్ధిపరచుకున్నప్పుడే ఇలాంటి భేదములకు, దుఃఖములకు, విచారములకు, అశాంతికి తావులేకుండా ఉంటుంది. 'ఏకాత్మసర్వభూతాంతరాత్మ'. అందరియందు ఉండిన దైవత్వము, దివ్యత్వము ఒక్కటేయనే సత్యాన్ని గుర్తించి వర్తించటమే మన కర్తవ్యము. ఈనాటి విద్యార్థులు 'ఎవరికివారే యమునా తీరే' అన్నట్లు ఎవరి స్వార్థస్వప్రయోజనములకు

srisathyasaivachanamrutam

వారు ప్రాకులాడుతున్నారేగానీ సమాజముయొక్క సుక్షేమమును దృష్టియందుంచుకొని సమాజసేవలో పాల్గొనేవారు ఎక్కడా కనిపించటంలేదు. పాలలో నీరు కలసిపోయినట్లుగా, విద్యార్థులు యీనాడు సమాజములో ఏకమై అందరితో ఐకమత్యముగా ఉండి సహనముతో సానుభూతితో సమాజముయొక్క సుక్షేమమును అభివృద్ధి పరచినప్పుడే దేశశాంతి చేకూరుతుంది.

**దేశసౌభాగ్యము వ్యక్తియొక్క సౌభాగ్యము, సౌశీల్యములపై ఆధారపడి ఉంటుంది**

విద్యార్థులారా! ఈనాడు మీరు చూస్తున్న పౌరులు, అధికారులు, ప్రజలు ఒకానొక సమయములో విద్యార్థులే! నేటి విద్యార్థులే రేపటి పౌరులు. నేటి విద్యార్థులే రేపటి అధికారులు. ఈ లక్ష్యమును దృష్టియందు ఉంచుకొని ఈ కనిపించే లోపములను, లోటులను సరియైన మార్గములో తీర్చిదిద్దే బాధ్యత మీ తలపై ఉంటున్నది.

ప్రేమస్వరూపులారా! వృక్షమునకు వేర్లు ఏ విధంగా ఆధారమో దేశమునకు విద్యార్థులే వేర్లవంటివారు. ఏనాడు చిత్తమనే వృత్తి క్షీణించిపోతుందో అప్పుడే జీవిత వృక్షము నేలకూలుతుంది. కనుక చిత్తవృత్తులను సక్రమమైన మార్గములో ప్రవేశపెట్టి జీవితమును సుక్షేమమైన మార్గములో తీర్చి దిద్ది సమాజమునకు మనము ఆనందమునందించాలి. 'నేను, నా కుటుంబము' అనే సంకుచితమైన భావములు విద్యార్థులందు ఏమాత్రము ప్రవేశింపచేయకూడదు. నీ సుఖము నీ కుటుంబముపై ఆధారపడిఉంటుంది. నీ కుటుంబము సమాజముపై ఆధారపడి ఉంటుంది. ఈ సమాజము దేశముపై ఆధారపడి ఉంటున్నది. కనుక దేశముయొక్క సౌభాగ్యము, సమాజముయొక్క సౌభాగ్యము కుటుంబముయొక్క సౌభాగ్యము వ్యక్తియొక్క సౌభాగ్యముపైన, సౌజన్యముపైన, సౌశీల్యముపైన ఆధారపడి ఉంటున్నది.

**అందరి హృదయములయందున్న దివ్యత్వము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించాలి**

విద్యార్థులారా! వివిధ దేశములనుండి వచ్చి చేరవచ్చు ఇక్కడ. వివిధ ప్రాంతములనుండి వచ్చి చేరవచ్చు ఇక్కడ. కానీ అందరి హృదయములయందున్న దివ్యత్వము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించాలి



sri sathyasai vachanamrutam

**మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే**
**వస్త్రభేదము వేరు దారమొక్కటె**
**శృంగారములు వేరు బంగార మొక్కటే**
**పశులవన్నెలు వేరు పాలు ఒకటె**
**జీవజంతులు వేరు జీవుండు ఒక్కడే**
**జాతినీతులు వేరు జన్మమొకటె**
**దర్శనంబులు వేరు దైవంబు ఒక్కడే**
**పూలవన్నెలు వేరు పూజ ఒకటె**
**తెలియలేకను మానవుల్ తెలివి దప్పి**
**బ్రతుకుకోసము బహుబంధ బద్ధులైరి**
**ఇంతకన్నను వేరెద్ది యెరుక పరతు**
**సాధుసద్గుణగణ్యులౌ సభ్యులార!**

దివ్యమైన, పవిత్రమైన భారతదేశము అనాదికాలమునుండి ఏకత్వమునే ప్రబోధిస్తూ దివ్యత్వమును గురించి ప్రచారము సల్పుతూ ఆనందమును చేకూర్చుచూ వస్తున్నది. భారతీయ ఉపనిషత్తులు దివ్యమైన ఏకత్వమును ప్రబోధిస్తూ అనేకత్వములోనున్న ఏకత్వమే మానవుడు గుర్తించవలసిన ప్రధాన లక్ష్యమని ప్రబోధిస్తూ వచ్చాయి. అయితే, ఈనాటి విద్యావిధానమునందు మానవుని స్వార్థమువల్లగానీ జీవుల స్వప్రయోజనమువల్లగానీ ఈ ఏకత్వము భిన్నమైపోయింది. అనేకత్వములో ఏకత్వము చూడవలసిన యీనాటి విద్యావంతులు ఏకత్వమును అనేకత్వముగా విభజించి అశాంతికి గురిచేస్తున్నారు

**ప్రాచీనకాలములో పల్లెలలో ఐకమత్యం అమితంగా ఉండేది**

ప్రాచీనకాలమునందు పల్లెలు మహా పవిత్రముగా ఉండేవి. ఈ పల్లెలందు ఐకమత్యము అమితంగా పెరిగేది. ఎవరి ఇంటిలో ఒక శుభకార్యము జరిగినా అందరూ ఏకంగా చేరి, ఆ యింటివారికి సహాయము చేసేవారు. అందరూ ఒక్క కుటుంబములోని వ్యక్తులవలె జీవించేవారు. 'ఈనాడు వారింటిలో కళ్యాణమైతే రేపు మా ఇంటిలో కళ్యాణము. నేను

srisathyasaivachanamrutam

పరులకు ఉపకారము చేసినప్పుడే పరులు నాకు ఉపకారము చేయగలరు', ఈ విధమైన విశాలభావములతో ఆనాటి పల్లెలు పవిత్రముగా అభివృద్ధి అవుతూ వచ్చాయి. ఆనాటి కుటుంబాలు ఉమ్మడి కుటుంబములుగా ఉండేవి. నలుగురు అన్నదమ్ములుంటే వారికి పిల్లలు ఉండినా అందరు ఒకే యింటిలో ఒకే కుటుంబముగా జీవిస్తూ వచ్చారు. కాలము కదులుతూ, యుగములు మారుతూ, జగములు పెరుగుతూ బుద్ధులు మారుతూ మతులు భ్రమించి భిన్నత్వమును అభివృద్ధి పరచుకొని యీనాటి పల్లెలందుకూడా భిన్నత్వములు పెరిగిపోతూ వస్తున్నాయి. ఇంటిలో నలుగురుంటే నలుగురు నాలుగు విధములైన అభిప్రాయ భేదములు. దీనికి కారణం ఏమిటి? స్వార్థమే దీనికి మూలకారణము. దురాశయే మూలకారణము.

**ఈనాడు అధికారవాంఛ, ధనవాంఛ, విపరీతంగా పెరిగిపోయింది**

ఈనాడు ప్రపంచములో అధికారవాంఛ, ధనవాంఛ మితిమీరిపోయింది. ధనము వస్తుంది, పోతుంది. ఎంతకాలము నీ దగ్గర ఉండగలదు? ఈ ధనముతో నీవు ఏమి చేయగలవు? నీకు ధనము అత్యవసరమే! కాని, మితిమీరిన ధనము మతి చెడగొడుతుంది. ఇంక అధికారవాంఛ చూస్తామా అంటే ప్రాణము పోయేంతవరకు అధికార పీఠముపై కూర్చోవాలి. ఈ దుర్గుణములతో, దుర్బుద్ధులతో, దురాచారములతో కూడిన రాజకీయములే పల్లెలను పాడుచేసి పెట్టాయి.

**రాజకీయములు పల్లెలను సమాధులుగా మార్చివేస్తాయి**

ప్రేమస్వరూపులైన పల్లె ప్రజలారా! మీరు మీ గ్రామములోపల రాజకీయములకు ఏ మాత్రము అవకాశము యివ్వకండి. ఎవరినీ మీరు ద్వేషించకండి. 'అద్వేష్టాసర్వభూతానాం'. అందరిని ప్రేమించండి. రాజకీయములు ప్రవేశపెడితే మన గ్రామము సమాజముగా ఉండదు. సమాధులుగా మారిపోతాయి. అలాంటి పరిస్థితికి తీసుకొని వస్తున్నాం ప్రజలంతాచేరి. ఒక్క ఇంటిలో ముగ్గురు ఏకంగా ఉంటుంటే ఎంత హాయి! అశాంతికే అవకాశము ఉండదు. బాధలు ఏమాత్రము మనలను బాధించవు. కానీ ఆ ముగ్గురిలో అభిప్రాయభేదములు అభివృద్ధి అయినప్పుడు దీనికంటె నరకమే మేలు అనిపిస్తుంది.

sri sathyasaivachanamrutam

'దేహోదేవాలయప్రోక్తో జీవో దేవస్సనాతనః'. దేహమనే గృహమందు ముగ్గురు నివసిస్తున్నారు. మనస్సులో ఒక భావన, మాట మరొకటి, చేయటం ఇంకొకటి. ఇలా ముగ్గురు మూడు రకములైన మార్గములలో పోతే ఈ గృహములో శాంతి ఏ విధంగా ఉంటుంది? శాంతిలేదు, కాంతిలేదు. అంతా అంధకారమే, అజ్ఞానమే! ఈ విధమైన పరిస్థితిలో మానవుడు దుఃఖమునకు గురికాక యింకేమి గతి? కానీ, మనుషులు చూడటానికి చాలా గంభీరముగా కనిపిస్తారు. ఏ దుఃఖము లేనివారుగా కనిపిస్తారు.

**మేడిపండు చూడ మేలిమై ఉండు**
**పొట్టవిప్పి చూడ పురుగులుండు**

మనిషి కనిపిస్తాడు, మంచి షైనింగ్‌తో; కాని లోపల ఎక్కడ చూచినా దుర్గుణములు, దురాలోచనలు అనే పురుగులు తప్ప మరొకటిలేదు. ఒక్క దైవభావము అందులో ప్రవేశించుటకు వీలుకాకుండా ఉంటుంది.

**అందరూ దైవముయొక్క బిడ్డలే!**

విద్యార్థులారా! ఈనాటి పరిస్థితి ప్రభావము చక్కగా గుర్తించి మీరు సరైన మార్గములో ప్రవేశపెట్టాలి, మీ జీవితమును. దేహములో రక్తము ప్రవహిస్తున్నాది. ఆ రక్తమునకు ఏది కులము? మన దేహములో కండరములుంటున్నాయి. వానిదే కులము? నీటిదే కులము? నిప్పుదే కులము? ఆకాశమునదే కులము? మన భూమిదే కులము? గగనమునకుగానీ, గాలికిగానీ ఏ కులమూ లేదు. ఈనాడు మనకే వచ్చిపడ్డాయి ఈ కులములంతా. ఇదియే పెద్ద అజ్ఞానము. ఇదియే పెద్ద మూర్ఖత్వము. ఇదియే పెద్ద రాక్షసత్వము. సమాజమును రూపుమాపి సమాజమును దుఃఖములో ముంచే ఈ కులమతములే చాలా వేరు చేస్తున్నాయి. అందరూ ఒక్కటే, అందరూ దైవముయొక్క బిడ్డలే! ఒక్క దైవమునకు యింతమంది పిల్లలు. కాబట్టి brotherhood of man and fatherhood of God. అందరూ భగవంతుని బిడ్డలే! భగవంతుని బిడ్డకానివారు ఒక్కరు లేరు, యిక్కడ. అందరూ భగవంతుని స్వరూపములే! 'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః' 'అందరు నా యంశమే, పంచభూతముల అంశముకాదు. ప్రకృతి అంశముకాదు. నాయొక్క అంశమే', అని గట్టిగా నొక్కి చెప్పాడు

sri sathyasai vachanamrutam

కృష్ణుడు. ఈ బోధను సంవత్సరములకొలది వింటున్నాము. ప్రతి functionలో ప్రవేశిస్తున్నాము. అన్నీకూడను వ్రాసుకుంటున్నాము. 'చాలా బాగా చెప్పారు, స్వామి!' అని అనుకుంటున్నాము. కాని ఎంతమంది నడచుకుంటున్నారు ఇక్కడ? ఎందుకు రావాలి ఇక్కడకు? వచ్చి ప్రయోజనం ఏమిటి? ఒక్కటైనా నడచుకోకుండా ఒక్కటైనా ఆచరణలో పెట్టకపోతే జీవితమే వ్యర్థము. మీకంటె పశువులు మేలు. మన elephant సాయిగీత ఉంటున్నాది. చెప్పినట్లు వింటుంది. చెప్పినట్లు చేస్తుంది. ఎంత తెలివి! 'మేము భక్తులమే', 'మేము భక్తులమే' అని చెప్పుకుంటున్నాము. ఇది చాలా అవమానకరమైన పదము. ఏదైనా ఒక్కటి మన జీవితములో నడచుకొని చూపిస్తున్నామా? ఒక్కరియందైనా శాంతి ఉన్నదా? ఒక్కరికైనా ద్వేషము లేకుండా పోయిందా? అహంకారము నిర్మూలమైనదా? దినదినమునకు అహంకారము పెరిగిపోతున్నాది. అందువల్లనే ఇన్ని కష్టములకు గురియైపోతున్నారు. పుట్టినదంతా కేవలం మట్టిగా మారిపోతుంది.

## ప్రకృతి, పరమాత్మల సంబంధము అవినాభావము, అన్యోన్యాశ్రయము

అందుకోసమే ప్రకృతి చెప్పిందట:

**ఏలపగాయె ఏలపగాయె ప్రభో మనకు యిటు ఏలపగాయె**
**విషమాయేప్రేమ మసియాయె మనసు వ్యధయే**

ప్రకృతి పరమాత్మునితో మొరపెట్టుకుంటున్నది: 'స్వామీ! ఎందుకు యీ పగలు, ద్వేషాలు ఇంతగా పెరిగిపోయాయి? నాలోపుట్టిన ప్రతి మానవుని మనస్సు మట్టి మాదిరి అయిపోయింది. ప్రేమంతా విషంగా మారిపోయింది. వ్యసనమే ఫలం అయింది. ఇదా మన connection? ప్రకృతి, పరమాత్మ అవినాభావ సంబంధములు, అన్యోన్య ఆశ్రయములు. పవిత్రమైన భారతదేశములో లేని వేదాంతము మరెక్కడా లేదు. 1926వ సం॥లో ఒక బ్రిటీషు తత్త్వవేత్త ఇండియాలో ప్రవేశించాడు. అప్పుడు బ్రిటీషు పరిపాలన కనక అన్నీ చోట్లా స్వేచ్ఛగా సంచరించాడు. అయనే క్రిష్టల్. తిరిగి బ్రిటీష్ దేశమునకు వెళ్లి 'ఆహా! భారతీయులు ఎంత ఐకమత్యముతో జీవిస్తున్నారు! భారతీయ ఉపనిషత్తులు ఎంత పవిత్రతను బోధిస్తున్నవి!. భారతీయులందరిని బంధించి ఉంచే బ్రహ్మసూత్రము ఒక్కటే!



srisathyasaivachanamrutam

మణుల మధ్యలో సూత్రము ఏవిధంగా పోతుందో అట్లనే మనుషుల మధ్య దైవమనే సూత్రము ఏకంగా చేరి ఉంటున్నాది. పుడితే భారతదేశములో పుట్టాలి. మరణిస్తే భారతదేశములోనే మరణించాలి. ఇంత పవిత్రమైన దేశము మరొకటి లేదు, అని చెప్పాడు. అంతటి పవిత్రముగా ఉండిన ఈ భారతదేశము ఈనాడు మనం విచారణ చేస్తే మనకంటే విదేశీయులే చాలా గొప్పవారుగా కనిపిస్తున్నారు. సర్వసంగ పరిత్యాగులై పరుగెత్తి వస్తున్నారు.

**దేహసంబంధమైన సుఖములు, ఆడంబరములు క్షణికములే!**

తుచ్ఛమైన దేహసంబంధమైన ఆడంబరములు క్షణికములే! ఏమిటి ఈ దేహముయొక్క సుఖము? ఏమిటి ఈ దేహముయొక్క ఆనందము? ఎందులోనూ ఆనందములేదు. అందువలననే ఆనాడే శంకరులవారు చెప్పారు:

**మాకురు ధనజన యవ్వనగర్వం**
**హరతి నిమేషాత్కాలస్సర్వం**
**మాయామయమిదం అఖిలంహిత్వా**

ఈ సుఖాలన్నీ క్షణములో కదలిపోయేవి. ఒక్క నిముషమైనా సుఖము మన దగ్గరలేదు. నల్లని మేఘములమధ్య తెల్లగ మించినట్లుగా ఒక్కతూరి ఆ సుఖము గడచిపోతుంది. లైటు మించిందిగానీ దాని వెనుకే పెద్ద చీకటి వచ్చింది. ఈ చీకటిని మనం గుర్తించుకోటంలేదు. లైటును మాత్రమే గుర్తించి మనము ఆనందిస్తున్నాము. 'ముందున్నదిరా తొందరలోనే ముసలితనమను ముసుళ్ల పండగ'. అప్పుడు నీ బిడ్డలే నిన్ను హాస్యం చేస్తారు

**మసలలేవు కనుమసకలు మోమున**
**ముడుతలు పడె తల నెరిసెనుగా**
**ముసలి కోతియని పసివారలు నిన్**
**ముసిముసి నవ్వగ కసరే బొమ్మా ॥తై తై॥**

**ఆస్తిపాస్తులు పంచుకోవచ్చునుగాని దైవానుగ్రహము పంచుకొనుటకు వీలులేదు**

srisathyasai vachanamrutam

ఐకమత్యము మనము ఈనాడు సాధించాలి. ఈనాడు ఇంటిలో ఉన్న వారికే ఒకరితో ఒకరికి ఐకమత్యము లేదు. ఇంటికి, పక్కింటికి ఐకమత్యములేదు. పల్లెకు, పల్లెకు ఐకమత్యములేదు. ఒక రాష్ట్రమునకు, మరొక రాష్ట్రమునకు ఐకమత్యములేదు. ఏమిటి ఈ ఖర్మ? ఇది కేవలము దుర్బుద్ధులయొక్క లక్షణాలే! దేశముయొక్క సుక్షేమము ఆశించేవారు ఈ విధమైన కలహములకు ఏమాత్రం అవకాశమివ్వరు. కావలసినంత జలము ఉంటున్నాది, భారతదేశములో. గంగ, యమున, గోదావరి, కృష్ణ, కావేరి ఎంత పెద్ద పెద్ద జీవనదులు! ఈ జలమునంతా ఎందుకు వీరు సద్వినియోగము చేసుకోకూడదు? ఇది నాది, ఇది నీది అని కోట్లాటకుపోయినప్పుడు ఈ దేహము ఎవనికిస్తాడు? ఎవ్వడూ దానిని ముట్టనుకూడా ముట్టడు.

**బంధువులందరు వాకిటిదాకను వల్లకాటికే వత్తురు**
**బంధమణచి నిన్ను బాయని ఆపద్భందువు భగవన్నామమెరా!**

'నాది, నాది'. ఏమిటి నీది? ఏదీ నీది కాదు. నీవే నీవుకాదు. నీది అనేది ఎక్కడనుంచి వస్తుంది? అంతా కూడబెట్టి కూడబెట్టి కట్టకడపటికి ఒక్కతూరి వదలిపెట్టి వట్టి చేతులతో నీవు పోతున్నావు. నీవు పుట్టే సమయంలో ఏమి తీసుకువచ్చావు? పోయే సమయంలో ఏమి తీసుకుపోతావు? ఈ రెండింటిని మనం చక్కగా అర్థం చేసుకుంటే మానవత్వంలో దురాశ అనేది కుళ్లిపోతుంది. ఒక్క మానవుడైనా పుట్టేటప్పుడు యింత గోచీ గుడ్డ పెట్టుకొని వచ్చాడా? లేదు. ఒక్క గుడ్డముక్క తీసుకొని రాలేదు. నా బిడ్డలు, నా కుమారులు, నా అల్లుళ్లు అని ఊరకే బాధపడిపోతాడు. ఎవరు నీవారు? నీవు పోయే సమయంలో వారికి నీ ఎడ్రస్సు యిచ్చి పోతున్నావా? వారందరు నీవారైతే వారికి నీవు ఎడ్రసు ఎందుకిచ్చి పోకూడదు? నీవారు కాదు. ఎవరికి ఎవరు? ఉండినంతవరకు నీ కర్తవ్యము నిర్వర్తించవలసిందే! కానీ దేవుని విషయములో ఎవరికి వారే! అమ్మకు బిడ్డపై చాలా ప్రీతి. బిడ్డ రోగము వచ్చి బాధపడుతుంటే తల్లి అంతకంటె పదింతలు బాధ పడుతుంది. బిడ్డపైన ప్రేమ ఉందని బిడ్డకు వచ్చిన కడుపునొప్పి తల్లి తీసుకుంటుందా? తీసుకోటానికి వీలుకాదు. అట్లనే బిడ్డకు ఆకలైతే, 'కొంచెం ఓపిక పట్టుకో, నేను తిని వస్తాను' అని అమ్మ చెబుతుందా!

sri sathyasai vachanamrutam

లేక అమ్మతింటే బిడ్డకు ఆకలి తీరుతుందా? పాపపుణ్యములు రెండూ ఎవరిది వారిదే. అమ్మది బిడ్డగానీ, బిడ్డది అమ్మగానీ పంచుకోటానికి వీలుకాదు. ఆస్తి పాస్తులు పంచుకోవచ్చునేగానీ దైవానుగ్రహము పంచుకొనుటకు వీలులేదు. నీదినీదే, వారిది వారిదే! కానీ అందరు క్షేమంగా ఉండాలని ప్రార్థించండి. అది చాలా ఉత్తమమైన పని. దానికోసమే ప్రతి భజన తరువాత 'సమస్త లోకాన్ సుఖినో భవంతు', అని ప్రార్థించడం.

**'నేను దైవము' అనే సద్భావము పెంచుకోవాలి**

ప్రేమస్వరూపులారా! చిన్న చిన్న విషయాలకై పల్లెలలోపల కలహాలు పెంచుకొని అది పెద్ద యుద్ధముమాదిరి మారిపోకూడదు. ఇది ఎవరికి నష్టము? చక్కగా విచారణ చేస్తే, ఆ క్షణములో వచ్చిన కోపము మన గ్రామమునకే కష్టము. కనుక మనము ఈ విధమైన కలహములకు చోటివ్వకూడదు. అన్యోన్యతగా ఉంటుండాలి. ఏదో కోపము వచ్చింది. కొద్ది సమయములో చల్లారి పోతుంది. కానీ గ్రామాభివృద్ధిని మనం చూచుకోవాలి. మన కుటుంబక్షేమము మనం చూచుకోవాలి. పేరు ప్రతిష్ఠలకై మనం చక్కగా పాటుపడాలి. ప్రాణాన్నైనా మన పేరు, ప్రతిష్ఠలకోసం వదలాలి. 'హస్తస్యభూషణం దానం'. చేతికి ఏది అందము? కంకణాలా అందము లేక బంగారు గాజులా అందము, మురుకులా అందము? కాదుకాదు. 'సత్యం కంఠస్యభూషణం'. పెద్ద నెక్లెసులు వేసుకుంటే కాదు, కంఠమునకు భూషణము. కంఠమునుండి సత్యము పలకాలి. అదే కంఠమునకు సరైన ఆభరణము. 'శ్రోత్రంభూషణం శాస్త్రం...... భూషణకిం?' ఇంతకంటె ప్రయోజనమైన భూషణాలు ఎందుకు? మానవునకు కావలసినవి ఇవి మూడే భూషణాలు. దీనితో మనం కీర్తి సాధించాలి. సత్యము పలకాలి, త్యాగము చేయాలి, మంచిని వినాలి. ఈ మూడు మనకుంటే మనకంటె మించిన దేవతలు మరొకరు లేరు. మీరే దేవుళ్ళు, మీకంటే దేవుడు ప్రత్యేకంగా లేదు. ఆ విధంగా అనుకో, 'అహం బ్రహ్మాస్మి' అని అనుకో! ఆ విధమైన ఉత్తమభావాలు తెచ్చుకుంటే good thoughts నీకు వస్తుంటాయి I am God. కాబట్టి నేను దేవుడుగా ప్రవర్తించాలి అనే conscience మననుండి ఆవిర్భవిస్తుంది. అట్టి పవిత్రమైన భావాలు మననుండి ఆవిర్భవించాలంటే 'నేను దైవము, దైవము' అనే సద్భావము మనం

పెంచుకోవాలి.

**దేవుడనగ వేరు దేశమున లేదు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

పాపము పరదేశములో లేదు, పుణ్యము పరదేశములో లేదు. దేవుడు పరదేశములో లేదు. అన్నీ నీ దేహములోనే ఉంటున్నాయి. కనుక ఆ దేహాన్ని పవిత్రమైన మార్గములో ప్రవేశపెట్టాలి.

**(తేదీ 30-08-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam